క్లుప్తంగా

లోకుమూడిలో ముందస్తు చర్యలు



మండవల్లి: పోలరాజ్ డ్రెయిన్ నుంచి లోకుమూడి గ్రామంలోకి వరద నీరు చేరే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామం వెలుపల డ్రెయిన్ సమీపంలో రాళ్లతో ఆదివారం కట్టను ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. ఎంపీడీఓ టీకే వెంకటరమణ, ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు మాట్లాడుతూ డ్రెయిన్ నుంచి వరద నీరు చేరితే గ్రామస్తులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గ్రామంలోకి నీరు చేరకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

వరద పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే

మండవల్లి: ముంపు గ్రామాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆర్డీఓ కె.ఖాజావలితో కలిసి ఆదివారం పరిశీలించారు. మండలంలోని తక్కెళ్లపాడు, కొవ్వాడలంక, నుచ్చుమిల్లి గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



తోట్లవల్లూరు: చాగంటిపాడు శివారు పిల్లివాని లంకలో వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. బ్యాంకు అధ్యక్షుడు ఆళ్ల సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 80 కుటుంబాలకు ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులతోకూడిన కిట్లను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ మర్రెడ్డి శేషిరెడ్డి వరద బాధితులకు పంపిణీ చేశారు. మర్రెడ్డి రవిరెడ్డి, హరిరెడ్డి, సుబ్బారెడ్డి, జనార్దన్‌రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, వీఆర్‌ఓ బాలకోటయ్య పాల్గొన్నారు.

వరదల్లో జీవాలకు రెండు లారీల పశుగ్రాసం

గుడ్లవల్లేరు: వరదలతో అతలాకుతలమైన పాడి రైతులు తమ మూగ జీవాలకు సరైన పశు గ్రాసం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో కౌతవరం గ్రామ రైతు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం వరదల్లోని మూగ జీవాలకు రెండు లారీల పశుగ్రాసాన్ని ఆదివారం తరలించారు. విపత్తులో అయినా ఆకలి వేస్తుందని బాధితులు నోటితో అడిగితే.. మూగ జీవాలు తమ ఆకలి బాధను చెప్పుకోలేవన్న ఆవేదనతోనే ఈ రెండు లారీల పశుగ్రాసాన్ని వరద ప్రాంతాలకు పంపుతున్నట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు.

వరద బాధితులకు భోజనం ఏర్పాటు



గుడ్లవల్లేరు: పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు గుడ్లవల్లేరు మండలం పెంజెంద్రకు చెందిన జై భీమ్ యూత్ సభ్యులు భోజనాల ఏర్పాటు చేస్తున్నారు. గుడివాడ వీకేఆర్ కాలేజీ, నందివాడ మండలంలోని అరిపిరాల, పొలాసు వారి పాలెంలోని పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆదివారం వెజిటబుల్ బిర్యానీని అందించారు.

మహిళలకు విద్య అవసరం

గుడివాడ టౌన్: ప్రస్తుత సమాజంలో మహిళలకు విద్య ఎంతో అవసరం అని పాస్టర్ రత్నబాబు అన్నారు. స్థానిక గుడ్‌మెన్ పేటలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో ఆదివారం ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కనీసం, చదవడం, రాయడం వచ్చినప్పుడే సమాజాన్ని అర్థం చేసుకోగలుగుతారన్నారు. హెలెన్, జోనస్, శశి, హెలెన్ సైదా, తదితర మహిళలు పాల్గొన్నారు.

గుర్రపుడెక్కను తొలగించాలి



కైకలూరు: ముంపు నివారణను నుంచి గట్టెక్కాలంటే ముందుగా డ్రెయిన్లలో గుర్రపుడెక్క, కొల్లేరులో కిక్కిస పాదలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆయన తామరకొల్లు నుంచి వేమవరప్పాడు వరకు పెదకొమ్ములేరు డ్రెయిన్ పొంగడంతో మునిగిన రహదారిని ఆదివారం పరిశీలించారు. నాలుగు రోజులుగా ఈ రహదారిపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్వం పంటు ద్వారా మిషన్లతో డెక్క, కిక్కిసను తొలగించారన్నారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం తొలగింపు పనులు చేపట్టాలని కోరారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు



గుడివాడ రూరల్‌లో పూజలందుకున్న వినాయకుడు



కైకలూరులో పూజలు చేస్తున్న దూలం నాగేశ్వరరావు



తోట్లవల్లూరు సినిమాహాలు రోడ్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం



గుర్రాల్లంక ఏటీఎం సెంటర్‌లో వినాయక స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



గుడివాడలో స్వామిని దర్శించుకునేందుకు వర్షంలో సైతం బారులు తీరిన భక్తులు



పెదపారుపూడి మండలం లక్ష్మీపురంలో పూజలు చేస్తున్న యువత



శ్రీహరిపురంలో చవితి వేడుకలు



ఆటపాకలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వర్షం కురుస్తున్నా చిన్నారులు, పెద్దలు విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల ఆదివారం విగ్రహాలను ఊరిగించి నిమజ్జనం చేశారు.

గుడివాడరూరల్: మండలంలోని మల్లాయపాలెం, చౌటపల్లి, మోటూరు, లింగవరం, వలివర్తిపాడు, రామనపూడి, బిళ్లపాడు, బొమ్ములూరు, చిన ఎరుకపాడు, దొండపాడు, సిద్ధాంతం తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. చవితి వేడుకల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు సిబ్బందితో కలసి పలు గ్రామాల్లో పర్యటించి కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. తొలుత ఎస్‌ఐ చంటిబాబు బొమ్ములూరులో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: వినాయకచవితి వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తోట్లవల్లూరుతో పాటు పలు గ్రామాల్లో భక్తులు గణేష్ పూజా మండపాలను ఏర్పాటు చేసి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

గుడివాడ టౌన్: వినాయక చవితి సందర్భంగా శనివారం పట్టణంలోని మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్వామిని బాల గణపతిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం స్వామిని మహాగణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలో వాడవాడలా వినాయక చవితి వేడుకలను ఆయా గ్రామాల భక్తులు నిర్వహించారు. కౌతవరం పెద దళితవాడలోని రామాలయం వద్ద ధర్మకార్య సంస్థ, చిరంజీవమ్మ క్రియేషన్స్ అధినేత చల్లపల్లి అమర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వినాయక చవితిని నిర్వహించారు. గుడ్లవల్లేరు పంచాయతీ ఎదుట బైక్ మెకానిక్ చుక్కల ఉపేంద్ర ఆధ్వర్యంలో వినాయక చవితి పూజలు చేశారు. సంతరోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ మట్టి వినాయక విగ్రహాన్ని భక్తులు దర్శించుకున్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని పలు గ్రామాల్లో చవితి వేడుకలు నిర్వహించారు. మండలంలోని వానపాముల గ్రామంలో బీసీ ఏరియాలో ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవ విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురంలో వినాయకుని ఉత్సవ విగ్రహానికి గ్రామానికి చెందిన కేతినేని శివశంకరవరప్రసాద్, వెంకట తరుణ్ కుమార్, షేఖ్ అజీజ్ యాకమూరి వెంకటేశ్వరరావు తదితరులు కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని గుర్రాల్లంకలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో 27 ఏళ్లుగా, బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలుగా వినాయకవిగ్రహాన్ని ప్రతిష్టించి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వీరంకిలాకు సెంటర్, ఎన్టీఆర్ కాలనీల్లో కూడా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో వాడవాడలా పందిళ్లు వేసి గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని చిగురుకోట శివారు నరసన్నపాలెంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ముదినేపల్లిలో మోటార్ వర్కర్స్ యూనియన్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చవితి వేడుకలను నిర్వహిస్తున్నారు. శ్రీహరిపురంలో యువకులు వేడుకలను చేస్తున్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా పూజలకు భక్తులు భారీ ఎత్తున హాజరవుతున్నారు.

కైకలూరులో..

కైకలూరు: ముసురుపట్టి వర్షాలు కురుస్తున్నా వినాయక చవితి వేడుకలను భక్తులు జరుపుకుంటున్నారు. కైకలూరు సెంటర్‌లో కూరగాయలు, పండ్లవర్తక సంఘం ఆధ్వర్యంలో 50వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథునికి వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పలు గ్రామాలకు వెళ్లి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పలు ప్రాంతాల్లోని చవితి వేడుకలకు హాజరయ్యారు.

ముంపు ప్రాంతాల్లో మంత్రి, ఎంపీ పర్యటన



నందివాడ: మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం పర్యటించారు. ఎవరూ అధైర్యపడవద్దని, ముంపునకు గురైన వారు పునరావాస కేంద్రాల్లో ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. వీరితో పాటు టీడీపీ నాయకుడు రావి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

కలిదిండి ఎంపీపీకి పితృవియోగం



కైకలూరు(కలిదిండి): వైఎస్సార్ సీపీ కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు తండ్రి కోటేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం కోరుకొల్లులో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఉమామహేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ బ్రహ్మాజీ, సర్పంచ్‌లు నరసయ్య, రాము, వడ్డీకాసులు, నాయకులు వెంటేశ్వరరావు, సాన రాము, బేబీ, కోరుకొల్లు ఉప సర్పంచ్ నాగరాజు, సోమేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆశలు ఆవిరి

బుడమేరు ఉధృతి కొనసాగుతూనే ఉంది. పలు గ్రామాలను వరద ముంచెత్తింది. పంట పొలాలు వరద నీటిలో మునిగిపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఎగువ నుంచి వస్తున్న వరద, మరో పక్క రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పుట్టగుంట వంతెన వద్ద నీటి ప్రవాహం 24 అడుగులకు చేరింది. దీంతో తొమ్మిదో రోజూ ఎంఎన్‌కే రహదారిపై రాకపోకలను అధికారులు నిలుపుదల చేశారు.

- ఆగని వరద ఉధృతి
- పొంగుతున్న బుడమేరు
- జలదిగ్బంధంలో గ్రామాలు



పుట్టగుంట వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

గుడివాడరూరల్: బుడమేరు నీటి ప్రవాహం, విస్తారంగా కురుస్తున్న వర్షాలు, ప్రకాశం బ్యారేజ్ నుంచి కాల్వలకు వచ్చే నీటితో దోసపాడు, గుడివాడ, అరిపిరాల, నెప్రాల్లీ, పొనుకుమాడు, లేళ్లపూడి చానల్స్, చంద్రయ్య, మోటూరు, తదితర డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. బుడమేరుకు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న జనార్దనపురం ప్రధాన సెంటర్‌ను వరద నీరు తాకింది. వాహనాలను ఇప్పటికే నిషేధించగా, ప్రజలను సైతం అటు వైపునకు వెళ్లకుండా పోలీసులు నిలిపివేశారు. బుడమేరు పరివాహక ప్రాంతాల డ్రెయిన్లు, కాల్వలు కరకట్టలను దాటేసి గ్రామాలను ముంచెత్తాయి. చంద్రయ్య డ్రెయిన్ ప్రభావంతో పలు గ్రామాలు, పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. నందివాడ మండలంలోని దోసపాడు చానల్ వలన నందివాడ, తుమ్మలపల్లి, పెదవిరివాడ, వెన్ననపూడి, రామాపురం, వెంకటరాఘవాపురం, అరిపిరాల, కుదరవల్లి, ఇలపర్రు గ్రామాలు నీటిలో మునిగాయి.

గ్రామాలకు తెగిన సంబంధాలు

డ్రెయిన్లు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో నందివాడ మండలంలోని పలు గ్రామాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. నందివాడ మండలంలోని జనార్దనపురం–కుదరవల్లి రోడ్డు 13 కిలోమీటర్ల మేర నీట మునిగి మూడు నుంచి నాలుగు అడుగుల వరకు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు బ్రేక్ పడింది. పోలుకొండ నుంచి గోపాలపురం, గాజులపాడు గ్రామాలకు వెళ్లే రోడ్డు నీట మునగడంతో వాహనాలను వెళ్లకుండా అధికారులు నిలిపివేశారు. గ్రామాలకు వాహన రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలను నందివాడ, గుడివాడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. ఎటుచూసినా నీటితోనే ఉండటంతో పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు ప్రత్యామ్నాయంగా పునరావాసం ఏర్పాటు చేసి మేత అందేలా చూడాలని పశుపోషకులు వేడుకుంటున్నారు.

తొమ్మిది రోజులు గడుస్తున్నా..

వరద వచ్చి తొమ్మిది రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వరద ప్రభావం కొనసాగుతుండటంతో పంట పొలాలు నీటిలోనే నానుతున్నాయి. నీరు తగ్గినా పంట పూర్తిగా పాడై చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు పూర్తిగా ఆశలు వదులుకున్నారు. జనార్దనపురం, తమిరిశ, చినలింగాల గ్రామాల్లో ఇప్పటి వరకు కాస్త పంట కనబడుతున్నా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ పంట కాస్త నీట మునగడం మొదలు కావడంతో రైతన్నలు ఈ గ్రామాల్లో కూడా పంట చేతికి రాదని రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు పంటపై ఆశ వదులుకున్న రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని ఇంత దారుణంగా నష్టపోతామని అనుకోలేదని లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటేగాని అప్పుల్లో నుంచి బయట పడలేవని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

రైతులకు కన్నీటి వేదన



తోట్లవల్లూరులో దెబ్బతిన్న పసుపు పంట


తోట్లవల్లూరు: కృష్ణానది వరదతో పంటలు నీటిముంపునకు గురై కుళ్లిపోతున్నాయి. నిన్న, మొన్నటి వరకు పచ్చగా కళకళలాడుతున్న లంకభూములు నేడు కుళ్లిన పంటలతో దర్శనమిస్తున్నాయి. వరద ముంపునకు గురై దెబ్బతిన్న పంటలను చూసి రైతులకు కన్నీటి వేదన తప్పటం లేదు. మండల పరిధిలోని కృష్ణా కరకట్ట వెంబడి రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పాములలంక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలోని లంకభూముల్లో వేలాది ఎకరాల్లో కంద, అరటి, పసుపు, తమలపాకుతోపాటు చెరకు, బొప్పాయి, జామ, కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కృష్ణా నదికి గతంలో ఎన్నడూ లేనివిధంగా వచ్చిన వరదతో ఆయా పంటలన్నీ నీటి ముంపునకు గురై దెబ్బతిన్నాయి.

భారీగా పెట్టుబడి..

పసుపు, కందకు మార్కెట్‌లో మంచి మద్దతు ధర లభిస్తుండటంతో రైతులు ఆయా పంటలను ఎక్కువగా సాగు చేశారు. ఒక ఎకరం పసుపు సాగుకు రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు ఖర్చుకాగా, ఒక ఎకరం కంద సాగుకు రూ.రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టారు.

ఉద్యానశాఖ అంచనా ప్రకారం పసుపు 2,697 ఎకరాలు, కంద 1,053, అరటి 2,277, బొప్పాయి 100, కూరగాయలు 217, ఆయిల్‌పామ్ 63, జామ 6, పూలు 30 ఎకరాల్లో సాగవుతోంది. అలాగే చెరకు పంటను కూడా రైతులు విరివిగా సాగు చేస్తున్నారు. ఆయా పంటల సాగుకి రూ.లక్షల్లో అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. ఈ పంటలన్నీ వరదబారిన పడటంతో ఏమి చేయాలో తెలియక లబోదిబోమంటున్నారు. ఆశగా ఎదురుచూపు వరదతో పంటలు దెబ్బ తిన్న రైతులు ప్రభుత్వం వైపు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు తగిన నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకి అవసరమైన విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని సాయం కోరుతాం



మండవల్లి మండలం నుచ్చుమిల్లికి పడవపై వెళుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు/మండవల్లి: వరదలతో కొల్లేరు గ్రామాలు పూర్తిగా ముంపు బారినపడ్డాయని, కేంద్ర ప్రభుత్వ సాయాన్ని కోరుతామని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండవల్లి మండలంలో ముంపు బారిన పడిన కొవ్వాడలంక, పులపర్రు, నుచ్చిమిల్లి, తక్కెళ్లపాడు, ఆనందరావుపేట, నాగభూషణపురం, మూలపేట, సుబ్బారావుపేట, ఉనికిలి, పుట్లచెరువు గ్రామాల్లో ముంపు బారిన పడిన గ్రామాలను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. నుచ్చుమిల్లి గ్రామానికి పడవ ద్వారా చేరుకుని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు సమీపంలోని ఉప్పుటేరు చిన్న వంతెన వద్ద రెండు వైపులా గుర్రపుడెక్క పేరుకుపోయి ఉంది. దీంతో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుతో కలిపి తొలగింపు పనులను కై కలూరు ఎమ్మెల్యే కామినేని పరిశీలించారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్డీఓ ఎస్‌కే ఖాజావలి, కైకలూరు తహసీల్దార్ ఉదయభాస్కరరావు, కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు



కైకలూరు: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కైకలూరు మండలం గోనెపాడు సమీప సింగాపురంలో ఆదివారం పురాతన పెంకుటిల్లు కుప్పకూలింది. పి.గంగాభవానీకి చెందిన ఇంటిని ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఆమె హైదరాబాదులో ఉంటున్నారు. ఇప్పుడు ఆ ఇంటిలో నాగనబోయిన నాగేశ్వరరావు, భార్య లక్ష్మి మనవరాలితో నివసిస్తున్నారు. పెంకుటిల్లు కూలిన సమయంలో వారు వెనుకభాగంలో ఉండటంతో ప్రమాదం తప్పింది. రెవెన్యూ అధికారులు, పోలీసులు వారిని సురక్షత ప్రాంతానికి తరలించి, ఆహారం అందిస్తున్నారు.

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

గుడ్లవల్లేరు: పోల్‌రాజ్, బంటుమిల్లి కాల్వల మధ్య నివాసం ఉండే వరద బాధితులకు కౌతవరం ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాలాజీరావు, ఎస్పీ గంగాధర్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం పరిశీలించారు. డీటీ బి.కనకదుర్గ, టీడీపీ నాయకులు కొసరాజు బాపయ్య చౌదరి, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, పామర్తి భాస్కరరావు, ఈడె కృష్ణారావు, వీఆర్వోలు ప్రకాష్, మల్లికార్జునరావు, రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనాలు ప్రారంభం



స్వామిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

గుడివాడ టౌన్: వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీ విఘ్నేశ్వర స్వామి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. వాతావరణం అనుకూలించకపోవడం, ఇతర కారణాలతో పండగ మరుసటి రోజే నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. స్వామి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో అలంకరించి మేళతాళాలతో ఊరేగిస్తూ స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని దొండపాడు కాల్వలో నిమజ్జనం చేశారు. భక్తులు జైజై గణేషా అంటూ రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ ఊరేగింపు కొనసాగింది.

మహమ్మద్ సిలార్‌కు గోపీచంద్ పురస్కారం



మహమ్మద్ సిలార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: విశ్రాంత తహసీల్దార్ డాక్టర్ మహ్మద్ సిలార్‌కు తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో త్రిపురనేని గోపీచంద్ సాహితీ పురస్కారం–2024 ఆదివారం అందజేశారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శారదా వికాస్ పబ్లిక్ స్కూల్లో జరిగిన గోపీచంద్ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డు ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రసాదరావు మాట్లాడుతూ సాహితీవేత్త త్రిపురనేని గోపీచంద్ రచనలు సర్వజనానికి ఆదర్శమన్నారు. జేసీస్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఉరిటి రామారావు, తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాదు, ఎంవీజే ఆంజనేయులు, నరహరశెట్టి ప్రసాదు, గానుగుల మాల్యాద్రి, లాజరు, గఫార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలు



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పామర్రు: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలను అందజేసినట్లు పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షులు నవులూరి వీరవెంకయ్య పేర్కొన్నారు. శనివారం భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. లయన్స్ క్లబ్‌కార్యవర్గ సభ్యులు డాక్టరు బీవీ అప్పారావు, కూనపరెడ్డి చంద్రశేఖరరావు, బైసాని నాగేశ్వరారావు, పీఎంఎస్ ప్రసాద్, లంకపల్లి శ్రీనివాసరావు, ఎం మధుసూదనరావు, బొప్పన స్వర్ణలత పాల్గొన్నారు.
– జమీదగ్గుమిల్లి గ్రామంలో సర్పంచ్ చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేశారు.

మొపర్రు రైతులకు ఎమ్మెల్యే పరామర్శ



మొపర్రులో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుమారరాజా

మొపర్రు(పెదపారుపూడి): వరద కారణంగా మండలంలోని మొపర్రు జలదిగ్బంధంలో ఉండటంతో ఎమ్మెల్యే వర్ల కుమారరాజా వెళ్లి రైతులను ఆదివారం పరామర్శించారు. నీట మునిగిన పొలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో భోజన సదుపాయాలను ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.